క్లుప్తంగా

వృద్ధాశ్రమాల్లో అన్నదానం



తెనాలిఅర్బన్: శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం సభ్యులు గరికపర్తి కాశీవిశ్వనాథ్ దేవర 7వ వర్ధంతిని పురస్కరించుకుని వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో గాంధీ నగర్‌లోని శిరిడి సాయి వృద్ధాశ్రమం, బుర్రిపాలెం రోడ్డులో గాంధీ శాంతి ఆశ్రమం, నాజర్ పేటలోని మన ఇల్లు వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ఆదివారం అన్నదానం చేసి, పండ్లు పంపిణీ చేశారు. ఎస్వీయోగ కన్వీనర్ ముద్దా భక్తుని రమణయ్య, యోగా సభ్యులు పాల్గొన్నారు.

చిరు జల్లులతో కూడిన వర్షం



తెనాలిఅర్బన్: అల్పపీడనం ప్రభావం కారణంగా తెనాలి పట్టణంలో రెండు రోజుల నుంచి చిరు జల్లులతో కూడిన వర్షం కురుస్తోంది. ఆదివారం తెల్లవారుజాము నుంచి వర్షం అప్పుడప్పుడూ పడింది. రెండు రోజుల నుంచి వర్షం కురుస్తుండటంతో పల్లపు రోడ్లు జలమయమయ్యాయి. అలాగే చిరు జల్లులు పడుతూ ఉండటంతో ప్రజలు కొంత ఇబ్బందులకు గురయ్యారు.

వైద్య ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శ్యామ్



తెనాలి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా జె.శ్యామ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సీఐటీయూకు అనుబంధమైన ఈ యూనియన్ సమావేశం ఆదివారం విజయవాడలో జరిగింది. ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన జె.శ్యామ్ గుంటూరు జిల్లా లెప్రసీ విభాగంలో తెనాలి డివిజన్‌లో డెప్యూటీ పారా మెడికల్ అఫీసర్‌గా పనిచేస్తున్నారు. వైద్య శాఖలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు, ప్రభుత్వ పథకాలు, వైద్య, ఆరోగ్య రంగంలో వస్తున్న సంస్కరణ, ఉద్యోగ విధులు, సేవలపై సమావేశంలో చర్చించినట్లు శ్యామ్ తెలిపారు. తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

వృద్ధులు, దివ్యాంగులను ఆదుకోవాలి

నగరంపాలెం: ప్రతి ఒక్కరూ వృద్ధులు, దివ్యాంగులను ఆదుకునేందుకు ముందుకు రావాలని శ్రీహనుమాన్ ఆదర్శ సేవా సమితి అధ్యక్షుడు మామిడి మురళీకృష్ణ కోరారు. కొత్తపేటలోని సమితి కార్యాలయంలో ఆదివారం 60 మంది వృద్ధులు, దివ్యాంగులకు 11 రకాల నిత్యావసరాలు, బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతల సహకారంతో సమితి తరుపున సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు మాదాల ప్రకాష్, పోలేపల్లి వెంకట సుబ్రమణ్యం, పలకలూరి శివరావు, టి.మురళీ సాయి, కె.లీలాకర్, లహరి, ఎస్వీ రమణ పాల్గొన్నారు.

హామీల అమలుకు ప్రయత్నించని కూటమి ప్రభుత్వం

- అక్రమ కేసులతో ప్రజల దృష్టిని మళ్లించాలని ప్రయత్నం
- చెప్పింది చేప్పినట్లు చేసింది జగనన్న ప్రభుత్వమే
- మోసపూరిత హామీలు ఇవ్వనందునే ఎన్నికల్లో ఓటమి
- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు



మాట్లాడుతున్న గుంటూరు కృష్ణ

తెనాలి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు చేసిన వాగ్దానాల అమలుకు ప్రయత్నించటం లేదని, విధ్వంసం, దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులతో ప్రజల దృష్టిని మళ్లించాలని చూస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. స్థానిక గంగానమ్మ పేటలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించారు. పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి గుంటూరు కృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి ప్రతిపక్ష నేతలు, కార్యకర్తలపై దాడులు, దౌర్జన్యాలు కొనసాగుతున్నాయన్నారు. మరోవైపు కక్షపూరిత వైఖరిపై అక్రమ కేసులను బనాయిస్తున్నారని ఆరోపించారు. సుప్రీంకోర్టు మూడేళ్ల క్రితం తోసిపుచ్చిన కేసును, రఘురామకృష్ణంరాజు ఈ-మెయిల్ ఫిర్యాదుతో మళ్లీ ఇప్పుడు నమోదు చేయటం, అందులో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ఏ3గా చేర్చటం కక్షసాధింపునకు పరాకాష్టగా చెప్పారు. ప్రభుత్వ ఒత్తిడితోనే ఇద్దరు పోలీసు అధికారులపైనా, ఒక ప్రభుత్వ వైద్యురాలిపైనా కేసు నమోదు చేశారని ఆరోపించారు. ఇలాంటి కక్షసాధింపు వైఖరి కొనసాగిస్తే భవిష్యత్తులో రెండింతలు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. పార్టీ పట్టణ నేత దేసు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికల్లో నెగ్గటమే కోసమే కూటమి నేతలు ఎడాపెడా వాగ్దానాలు చేశారని విమర్శించారు. ఇప్పుడు ఆ హామీలను నిలుపుకునే ఉద్దేశం ఉన్నట్టుగా కనిపించటం లేదన్నారు. తల్లికి వందనం పేరుతో ఎందరు పిల్లలు చదువుతుంటే అంతమందికి రూ.15 వేలు ఇస్తామని చెప్పినట్టు గుర్తుచేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు రోడ్డెక్కారని, కూటమి నేతల్లా మోసపూరిత హామీలను ఇవ్వనందునే జగన్‌మోహన్‌రెడ్డి ఓటమి చెందారని శ్రీనివాసరావు అన్నారు. చెప్పింది చేసినట్టు చేసింది జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమేనని స్పష్టంచేశారు. జగన్‌మోహన్‌రెడ్డికి ఓటు చేసిన 39.6 శాతం ఓటర్ల తరపున తాము మాట్లాడుతున్నట్టు చెప్పారు. పార్టీ నాయకుడు పెదలంక వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో విధ్వంసం, అక్రమ కేసులు మినహా పరిపాలనపై దృష్టి పెట్టినట్లు లేదన్నారు. పార్టీ నేతలు యలవర్తి సాంబశివరావు, కాకి దేవసహాయం, కౌన్సిలర్ మొగల్ అహ్మద్‌బేగ్, కో-ఆప్షన్ సభ్యుడు పెచ్చింగ్ సుభాని, కుర్రా శ్రీను, మల్లెబోయిన రాము, అక్కిదాసు కిరణ్, టెక్స్ బాల, నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

మంత్రి నాదెండ్లకు ఆర్టీసీ కార్మికుల వినతి



మంత్రి మనోహర్‌ను కలిసిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘు నాయకులు

తెనాలిరూరల్: ఆర్టీసీలో ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు విజ్ఞప్తి చేశారు. పపట్టణంలోని బోస్ రోడ్డులో ఉన్న మంత్రి కార్యాలయంలో ఏపీఎస్ ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం రాత్రి మంత్రికి సమస్యలను విన్నవించారు. అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి పి.సుధీర్‌కుమార్ మాట్లాడుతూ థర్డ్ పార్టీ విధానంలో ఆర్టీసీలో 7,300 మంది కార్మికులు పని చేస్తున్నారని తెలిపారు. ఈ విధానం వల్ల చాలా నష్టపోతున్నామన్నారు. థర్డ్ పార్టీ విధానాన్ని రద్దు చేసి, నేరుగా సంస్థ నుంచి జీతం వచ్చేలా చర్యలు తీసుకుని ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

ప్రజా సేవతో ముందుకు

ఆంధ్రప్రదేశ్ కాకతీయ సేవా సమాఖ్య ప్రధాన కార్యదర్శి బెజవాడ వెంకట్రావు



ఎన్టీఆర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న నేతలు

తెనాలి: ఆత్మాభిమానం, పౌరుషంతో బ్రతుకుతున్న జాతి కమ్మ అని, పూర్వీకులు చూపించిన బాటలో నడుస్తూ సమాజానికి చేతనైనంత సేవ చేస్తూ ముందుకు వెళ్తున్నామని ఆంధ్రప్రదేశ్ కాకతీయ సేవా సమాఖ్య ప్రధాన కార్యదర్శి బెజవాడ వెంకట్రావు అన్నారు. స్థానిక చెంచు పేటలోని చావాస్ గ్రాండ్ కల్యాణ మండపంలో ఆదివారం తెనాలి ప్రాంత కమ్మ కుటుంబ సభ్యుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథి వెంకట్రావు మాట్లాడుతూ స్వర్గీయ త్రిపురనేని రామస్వామి, వెలగపూడి రామకృష్ణ, ముత్యాలరాజ, కాకాని వెంకటరత్నం, నార్ల తాతారావు లాంటి పెద్దలు సామాజిక వర్గ కీర్తి ప్రతిష్టలను ఇనుమడింపచేశారని గుర్తుచేశారు. వారి వారసులుగా సంఘానికి మంచి సేవా కార్యక్రమాలు చేయాలని కోరారు. రాష్ట్ర సమాఖ్య ప్రతినిధులు కొరప్రాటి అయోధ్య రామారావు, వెలగా కోటేశ్వరరావు, కర్నాటి శ్రీనివాస చక్రవర్తి, పర్చూరు శ్రీనివాసరావు, తెలంగాణ రాష్ట్ర సమాఖ్య అధ్యక్షుడు బొడ్డు రవిశంకర్ రావు, గ్రేటర్ విజయవాడ సంఘ అధ్యక్షుడు నన్నపనేని నాగేశ్వరరావు, సభ్యులు గుమ్మడి రామకృష్ణ మంచిర్యాల సంఘ సభ్యుడు మురళి, స్థానిక ప్రముఖులు డీఎల్ కాంతారావు, అన్నాబత్తుని సదాశివరావు, విశ్రాంత ఎంపీడీఓ కనకమేడల కుసుమకుమారి, సూరపనేని కల్పన తదితరులు ప్రసంగించారు. ప్రముఖ వ్యాపారులు కొత్త సుబ్రహ్మణ్యం, అడుసుమిల్లి వెంకటేశ్వరరావు, పాలడుగు రాజశేఖర్, డాక్టర్ కొమ్మినేని రమేష్‌బాబు, ఈదర పూర్ణచంద్, ఆలపాటి వెంకట్రామయ్య, పుష్పకుమారి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని నలుమూలల్నుంచి కమ్మ కుటుంబ సభ్యులు హాజరయ్యారు. నూతనంగా ఏర్పడిన సంఘానికి ఈదర శ్యామ్‌ప్రసాద్ రూ.25 లక్షలు విరాళం ప్రకటించారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న మంత్రి మనోహర్

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణ విశ్వ బ్రాహ్మణ సంఘం నిర్వాహకులు సేవా కార్యక్రమాల్లో ముందు ఉండటం అభినందనీయమని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. తెనాలి పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో దామర్ల వారి వీధిలోని శ్రీ వీరాట్ విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపంలో ఆదివారం 200 మంది పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పేద పిల్లలను ఆదుకునేందుకు పలు సంస్థల ముందుకు రావడం సంతోషకరమన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు జి.అర్జున్, పుస్తకాల దాత సుధాకర్, డాక్టర్ శివకుమార్, టి.ఉదయశంకర్, శేషుబాబు, లక్ష్మీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

తెనాలిరూరల్: ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని ఐతా నగర్‌కు చెందిన షేక్ ఆషా(34) ఆదివారం సాయంత్రం తన ఇంటిలో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అయితే ఆమెకు తెలిసిన వారితో వివాదం కారణంగా ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సమాచారం అందుకున్న టూ టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

అలరించిన ఏ షామ్ మస్తానీ-15



నగరంపాలెం: స్థానిక మార్కెట్ సెంటర్‌లోని శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏ షామ్ మస్తానీ-15 హిందీ పాత సినీ గీతాల విభావరి ఆదివారం రాత్రి జరిగింది. గాయనీ గాయకులు అమ్మపండు, పూజ, శరణ్య, నందిని, హేమమాలిని, మానస, సింధు, కల్యాణ్, విజయ్‌సాయి, శ్రీనివాసరావు, ప్రత్యేక గాయనీ లలిత (పాడుతాతీయగా) పాత చిత్రాల్లోని హిందీ పాటలను ఆలపించారు. మలయాళ చిత్రం మేఘతీర్థంలోని అతి క్లిష్టమైన భావయామి అనే గీతాన్ని లలిత అద్భుతంగా ఆలపించారు. కళాకారుడు శివ మిమిక్రీ అలరించింది. 15 ఏళ్లుగా కార్యక్రమాల నిర్వహణకు సహకరిస్తున్న ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్ట్ కార్యదర్శి పి.రామచంద్రరాజును గీతాంజలి ఆర్కెస్ట్రా సంస్థ నిర్వాహకుడు అమ్మ పండు, కళాకారులు కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది సాయికృష్ణ శ్రీనివాస్, రెడ్ క్రాస్ కోశాధికారి రవిశ్రీనివాస్, దోప్పలపూడి శ్రీనివాసరావు, షూకూర్ పాల్గొన్నారు.

ఆర్‌యూబీ పనులు త్వరితగతిన ప్రారంభించాలి



సీపీఐ పతావిష్కరణ చేస్తున్న నగర కార్యదర్శి మాల్యాద్రి, నాయకులు

లక్ష్మీపురం: గుంటూరు నగరంలో నెహ్రూ నగర్ నుంచి వెంకటాద్రి పేట మీదగా సంజీవనగర్ రైల్వే ట్రాక్ ఎప్పుడు రద్దీగా ఉండటం వల్ల అక్కడ రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జి ఏర్పాటుపై దృష్టి పెట్టాలని సీపీఐ నగర కార్యదర్శి కోటా మాల్యాద్రి పేర్కొన్నారు. స్థానిక వెంకటాద్రి పేట సెంటర్‌లోని సీపీఐ పతాకావిష్కరణ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ నుంచి గుంటూరు మీదుగా అనేక రైళ్లు, గూడ్స్‌లు పెరిగిందన్నారు. దీంతో ప్రతి ఐదు నిమిషాలకు ఒక రైలు వెళ్లడంతో రైల్వే గేటు వద్ద విద్యార్థులు, వివిధ పనులకు వెళ్లాల్సిన ప్రజలు నిలబడిపోవాల్సి వస్తోందన్నారు. ఇన్నర్ రింగ్ రోడ్ ఏర్పాటు చేసిన తర్వాత ఈ బ్రిడ్జి ప్రాధాన్యత పెరిగిందని చెప్పారు. ఎంపీ, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ గుంటూరు నగరంలోని బ్రిడ్జిలపై దృష్టి పెట్టారని ఈ ట్రాక్ ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకొని త్వరగా పూర్తి చేసి నగర ప్రజలకు ఇబ్బందులను తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 56వ డివిజన్ కార్యదర్శి పల్ల యేసురత్నం, పాతర్ల జాన్ ,దివెన్ కుమార్, రమేష్, డేవిడ్ ,ఏసు, బాబు, భాస్కర్, ఏసు పాదం, రమేష్ , రాంబాబు తదితరులు పాల్గొన్నారు .

ప్రతిభావంతులకు చేయూతనివ్వాలి

నగరంపాలెం: ప్రతి విద్యార్థి విద్య ద్వారా ఉన్నతంగా ఎదగాలని బొందిలి సంక్షేమ సేవ సమాజ్ అధ్యక్షుడు రాథోడ్ సుజాన్‌సింగ్ అన్నారు. పది, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన బొందిలి విద్యార్థులు 120 మందికి ఆదివారం జీటీ రోడ్డులోని శ్రీ సదాశివ టైపు ఇన్‌స్టిట్యూట్‌లో ఉచితంగా నోట్ పుస్తకాలు, ప్రోత్సాహక నగదు అందించారు. ఈ సందర్భంగా రాథోడ్ సుజాన్ సింగ్ మాట్లాడుతూ భవిష్యత్తులో మంచి ఉద్యోగాలలో స్థిరపడాలన్నారు. తద్వారా మరి కొంతమంది ప్రతిభ ఉన్న విద్యార్థులకు చేయూతనందించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైల్వే విశ్రాంత ఉద్యోగి రామకృష్ణ సింగ్, సమాజ్ కార్యదర్శి శ్రీనివాససింగ్, సంయుక్త కార్యదర్శి నిర్మల్ సింగ్, సభ్యులు నరేంద్ర నాథ్ సింగ్, రూప్‌సింగ్, బాలాజీసింగ్, శంకర్ సింగ్, లాలా ప్రసాద్ పాల్గొన్నారు.

మధుమేహులు రెటినోపతి పట్ల అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ రాచపల్లి కల్పనారెడ్డి

గుంటూరు మెడికల్: మధుమేహం మన దేహంలోని ప్రతి అవయవంపై ప్రభావం చూపుతుందని రక్తంలో అసాధారణ షుగర్ శాతాన్ని నిర్లక్ష్యం చేసిన కారణంగా చూపును కోల్పోతున్న వారి సంఖ్య ఎక్కువగా ఉంటుందని డాక్టర్ అగర్వాల్స్ ఐ హాస్పిటల్ నేత్ర వైద్య శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ రాచపల్లి కల్పనారెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం స్థానిక బ్రాడీ పేటలోని ఎస్‌హెచ్‌ఓ భవనంలో ఎస్‌హెచ్‌ఓ హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా నిర్వహించిన రెటినోపతి ఉచిత పరీక్ష శిబిరం -శాస్త్రీయ అవగాహన సభలో డాక్టర్ కల్పనారెడ్డి పాల్గొని ప్రసంగించారు. సభకు సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు, అధ్యక్షుడు డాక్టర్ టి.సేవ కుమార్ అధ్యక్షత వహించారు. డాక్టర్ కల్పనా రెడ్డి ప్రసంగాన్ని కొనసాగిస్తూ కంటి వెనుక భాగంలో 10 పొరలతో నిర్మితమైన రెటీనా ఉంటుందని చెప్పారు. రక్తంలోని షుగర్ శాతం అసాధారణంగా ఉండడం, ఈ అసాధారణతలలో కూడా హెచ్చుతగ్గులు ఉండడం వల్లనే అత్యంత సున్నితమైన రక్తనాళాలలో అసాధారణ మార్పులు చోటు చేసుకుంటాయని తెలిపారు. మధుమేహ బాధితుల్లో రెటీనాలో వచ్చిన ఈ విధమైన మార్పులనే' డయాబెటిక్ రెటినాపతి'గా పేర్కొంటారన్నారు. అధిక రక్తపోటుగల వారిలో కూడా రెతినొపతి వస్తుందని దీన్ని హైపర్ టెన్సివ్ రెటినోపతీ అంటారని చెప్పారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ పావులూరి రమేష్ మాట్లాడుతూ విద్యావంతులు చైతన్యవంతులై నేత్రదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. సభాధ్యక్షుడు డాక్టర్ టి.సేవ కుమార్ మాట్లాడుతూ జనవరి, జూలై నెలల్లో డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్ సహకారంతో ఉచిత రెటినోపతిపరీక్ష శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి కె.సతీష్‌బాబు, కోశాధికారి టీవీ సాయిరాం, సీహెచ్ శివాజీ, సీహెచ్ లక్ష్మి సామ్రాజ్యం, డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్ పీఆర్వో డి.సుధాకర్, సిబ్బంది ఎస్.రూప, సీహెచ్ జోత్స్న రెడ్డి, టి.శివప్రసాద్, టి.కృష్ణ, ఎస్‌హెచ్‌ఓ సిబ్బంది పాల్గొన్నారు .

ఆకట్టుకున్న ఇంద్రజాల ప్రదర్శన



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్ శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళా వేదికపై ఏపీ మెజీషియన్స్ అసోసియేషన్, అమరావతి మ్యాజిక్ ఫెస్టివల్ 40వ ఇంద్రజాల మహోత్సవాలు ఆదివారం నిర్వహించారు. తొలుత ఆలయ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మెజీషియన్స్ ఇంద్రజాల ప్రదర్శనలు ప్రేక్షకులను అబ్బురపరిచాయి. అనంతరం అసోసియేషన్ సభ్యులను దేవాలయ పాలక మండలి సత్కరించింది. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు జేవీఆర్, కార్యదర్శి డాక్టర్ ఆర్యల్, డాక్టర్ ఆర్ఎల్ ప్రసాద్ పాల్గొన్నారు.

వన్నెలద్దే.. మేనుకు మేలు చేసే

- గోరింట పండింది.. మగువ మురిసింది
- అలంకరణకే కాదు..ఆరోగ్యానికి శ్రేయస్కరం
- తరాలు మారిన తరగని సంప్రదాయం
- ఆషాఢంలో మరింత మక్కువ
- సాధారణ గోరింటాకే మేలంటున్న వైద్యులు

యువతి చేతికి పెట్టిన గోరింటాకు ఎంత ఎర్రగా పండితే అంత మంచి మొగుడొస్తారని పెద్దల మాట. ఆరిని గోరింటాకు కగిడిన తర్వాత పౌర్ణమి చంద్రుడు మగువ చేతికి చిక్కి పండిపోయాడా అన్నంత అందంగా అర చేతులు వన్నెలద్దుకుంటాయి. పల్లె, పట్టణం తేడా లేకుండా పండుగ, శుభకార్యం ఇలా సందర్భం ఏదైనా.. గోరింటాకు సంప్రదాయానికి ఆదరణ తగ్గడం లేదు. ఆషాఢ మాసంలో మహిళలు, యువతులు, చిన్నారుల సహా ఇంటిల్లి పాదీ చేతులకు, కాళ్లకు గోరింటాకు పెట్టుకోవడం తెలుగింటి ఆచారంగా వస్తోంది. తరతరాలుగా వస్తున్న విధానం వెనుక ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఇమిడి ఉన్నాయి.



ఎర్రగా పండిన తన అరచేతులను చూపుతున్న మనస్వీ అనే విద్యార్థిని

కొల్లిపర: గతంలో ప్రతి ఇంటి పెరటి గోరింటాకు మొక్క తప్పనిసరిగా ఉండేది. లేత ఆకులను కోసి, రుబ్బు రోలులో మెత్తగా రుబ్బి, మహిళలు చేతులకు, పాదాల చుట్టూ అందంగా పెట్టు కొనేవారు. ఎర్రగా పండిన చేతులు మహిళలు, యువతుల సహజ సౌందర్యానికి అదనపు వన్నెలద్దేవి. పల్లెల్లో ఇప్పటికీ సంప్రదాయంగా గోరింటాకునే రుబ్బి పెట్టుకుంటున్నారు.

ఆషాఢంలోనే ఎందుకు..?

ఆషాఢ మాసం అంటే వర్షాలు జోరుగా పడే రోజులు. నేలంతా తేమగా బురదతో నిండి ఉంటుంది. నిత్యం ఇంటి పనుల్లో తలమునకలయ్యే మహిళలు ఎక్కువగా నీటిని ఉపయోగిస్తుంటారు. తడి నేలపై పదేపదే తిరగాల్సి ఉంటుంది. వర్షాకాలంలో సహజంగా ఉండే తేమ ప్రభావంతో వారి చేతులు, కాళ్ల ఒరిసిపోవడంతో పాటు గోళ్లు తింటాయి. ఈ సమస్యలకు గోరింటాకుతో ఉపశమనం లభిస్తుంది. ఆషాఢ మాసంలో గోరింటాకు పెట్టుకొనే సంప్రదాయం వెనుక ఈ ఆరోగ్య ప్రయోజనం దాగుందని పెద్దలు అనాటి నుంచి ఈ నాటి వరకు తమ పిల్లలకు చెబుతున్నారు.

ప్రయోజనాలెన్నో..

మానవుడు చేతికి గోరింటాకు పెట్టుకోవడం వల్ల శరీరంలో ఉన్న వేడిని తగ్గిస్తుంది. దీన్ని తలకు, కేశాలకు పట్టిస్తే రాలిపోకుండా, మృదువుగా ఉండటంతో పాటు చుండ్రు, దురద వంటి సమస్యలు దరిచేరవు. ఆటలమ్మ మచ్చల నివారణకు గోరింటాకును పురాణకాలం నుంచి వినియోగిస్తున్నారు.



గోరింటాకు చెట్టు



మార్కెట్‌లోని కోన్‌లు

రసాయనాలతో హాని..

పల్లెల్లో ,పట్టణ ప్రాంతాల్లో గోరింటాకు చెట్లు కనుమరుగవడంతో మార్కెట్‌లో రకరకాలుగా రెడీమేడ్‌గా దొరికే కోన్‌లు, మెహందీలతో సంతృప్తి చెందుతున్నారు. గోరింటాకు చెట్టు నుంచి కొసి రుబ్బడం వంటి పనుల నుంచి తప్పించుకునేందుకు, ప్యాషన్ అనే మోజులో పడి పల్లె ప్రజలు కూడా కోన్‌లపై ఆధారపడిపోతున్నారు. వీటిలో ఉండే పలు రసాయన మిశ్రమాల వల్ల చిన్న పిల్లలకు, పెద్దలకు సరిపడ్డక అలర్జీలు వస్తాయని వైద్యులు, ముసలి అవ్వలు హెచ్చరిస్తున్నారు. సహజ సిద్ధమైన గోరింటాకుతో ఎలాంటి దుష్పరిణామాలకు తావు ఉండదని చెబుతున్నారు.

ఎంతో ఇష్టంగా



మహిళలు ఆషాడ మాసంలో గోరింటాకు పెట్టుకోవడానికి ఎంతో ఇష్టపడతారు. నేటి యువతులు గోరింటాకు బదులు కోన్‌లు వాడుతున్నారు. గతంలో గోరింటాకు మొక్కలు ప్రతి ఇంట్లోని పెరట్లోనూ ఉండేవి. ఇప్పుడు ఇళ్లల్లో ఖాళీ స్థలాలు అరుదుగా గోరింటాకు మొక్కలు పెంచుతున్నారు.

– అవుతు విజయలక్ష్మి, గృహిణి, తూములూరు

ఎన్నో ఔషధ గుణాలు



గోరింటాకులో అనేక ఔషధ గుణాలున్నాయి. దీనిని పెట్టుకోవడం వల్ల శరీరంలోని వేడిని తగ్గించడంతో పాటు రగ నిరోధక శక్తిని పెంచుతుంది. ప్రధానంగా వర్షాకాలంలో వచ్చే చర్మ వ్యాధులను దూరం చేస్తుంది. సహజ సిద్ధమైన గోరింటాకులో మాత్రమే ఇలాంటి ప్రయోజనాలున్నాయి.

– వేముల ప్రియాంక, వైద్యాధికారిణి, కొల్లిపర